# 2

# మరణమందు ఏమి సంభవిస్తుంది?

*“మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును” (ప్రసంగి 12:7).*

ఒక వ్యక్తి చనిపోయినప్పుడు ప్రాణము, ఆత్మ, దేహములకు ఏమి సంభవిస్తుంది? భౌతికముగా మరణించిన మీదట ప్రాణాత్మలు ఉనికిలో ఉంటాయా? మరణానంతరం మనం జీవిస్తామనే భావం ఏదైనా ఉందా? “ప్రాణములేని శరీరము మృతము” అని బైబిలు అన్నా (యాకోబు 2:26), శరీరము లేని ఆత్మ మృతమని మాత్రం అనలేదు. మరణానంతరం మన జీవితం కొనసాగుతుందని క్రీస్తు ప్రభువు సూచించారు: “నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదువలేదా? ఆయన సజీవులకే దేవుడుగాని మృతులకు దేవుడు కాడని వారితో చెప్పెను” (మత్తయి 22:31, 32). దేవుడు పితరుల దేవుడైయుండి, ఆయన సజీవులకే దేవుడు గాని మృతులకు దేవుడు కాకుంటే, ఏదోయొక భావంలో బైబిలు వ్యక్తులు మరణానంతరం సజీవులుగా ఉన్నారని అర్థమిస్తుంది.

వారు ఎంతో కాలం ముందు వెడలిపోయినవారైనా, రూపాంతరపు కొండమీద ప్రభువుతో పాటు మోషే ఏలీయాలు ప్రత్యక్షమయ్యారు (మత్తయి 17:1–4). లూకా 16:19–30లో, అబ్రాహాము, లాజరు, ధనవంతుడు ఉనికి కలిగియున్నట్టును, స్పృహగలవారైయున్నట్టును క్రీస్తు ప్రభువు చిత్రించారు. మూడవ ఆకాశమునకు కొనిపోబడినప్పుడు (2 కొరింథీ. 12:2–4), పౌలు “శరీరం లేకయే కొనిపోబడి” యుండవచ్చు (2 కొరింథీ. 5:8), అంటే దాని అర్థమేమి? శరీరాలకు వెలుపల మన ఉనికి సాధ్యమని సూచించుటయే గదా?

## మరణము, భౌతిక దేహము

గర్భము ధరించినప్పుడు, దేవుడు మన ఆత్మను మన దేహంలోనికి పంపుతాడు (ప్రసంగి 12:7; జెకర్యా 12:1). ఆత్మ దేహంతో కలిసినప్పుడు దేహానికి ప్రాణం వస్తుంది. ప్రాణాత్మలు దేహంలో ఉన్నంత కాలం దేహానికి సజీవ చర్యలుంటాయి (1 రాజులు 17:21, 22; యాకోబు 2:26).

మరణము శరీర ఉనికిని రద్దు చేయదు, కాని దేహంలోని సజీవచర్యలను రద్దు చేస్తుంది. దేహాన్ని సుగంధ ద్రవ్యాలతో సిద్ధపరచక పోయినట్టయితే, మరణమునుండి దేహము కుళ్లు పట్టనారంభిస్తుంది, కడకు అది తిరిగి మంటికి చేరుకుంటుంది (ఆది.

3:19; ప్రసంగి 12:7). దేహానికి ప్రాణమే దాని భౌతికమైన బలమును, శరీరసంబంధమైన సజీవ చర్యలను కలిగిస్తుంది. మరణ సమయమందు, దాని భౌతికమైన, మానసికమైన, ఉద్వేగసంబంధమైన చర్యలు అంతరించిపోతాయి. దేహము చేయగల సత్కార్యములు, దుష్కార్యములన్నియు మరణమందు అంతరించిపోతాయి.

---

**"ప్రాణము"** (*zoe*) ఈ క్రిందివాటిని వర్ణించనుపయోగించబడ్డాయి:

1. భౌతిక జీవము (అపో. 17:25)
2. నిజముగా జీవించు విధానం (లూకా 12:15; రోమా 6:4; 8:6, 10; గలతీ. 2:20; 1 పేతురు 3:10; 2 పేతురు 1:3)
3. ఆత్మ సంబంధమైన జీవము (యోహాను 10:10; 1 యోహాను 5:12). ఇది క్రొత్త జన్మవలన లభ్యమయ్యింది. అది మరణమువలన బాధింపబడదు గనుక శాశ్వతమయ్యిందిగా భావించబడింది
4. భవిష్యత్ జీవితము (మత్తయి 7:14; 18:8, 9; మార్కు 10:30; యోహాను 5:29)
5. క్రీస్తు, జీవమునకు మూలమై ఉన్నారు (యోహాను 1:4; 14:6)

---

**"మరణము"** (*thanatos*) ఉపయోగింపబడిన తీరు

1. భౌతిక మరణము (మత్తయి 20:18; లూకా 2:26)
2. దుర్మార్గపు జీవితము (రోమా 8:6; 1 తిమోతి 5:6)
3. మరణములో ఆత్మసంబంధంగా చనిపోవడమే (కొలస్సీ. 2:13) మరియు దేవునినుండి వేరుచేయబడడమే (యెషయా 59:1, 2; ఎఫెసీ. 2:11–13) తన తండ్రియొద్దనుండి వేరుచేయబడిన తప్పిపోయిన కుమారునిలా – అత డు చనిపోయినట్టు భావించబడ్డాడు (లూకా 15:24)
4. పాపము విషయమై మనం ఆత్మ సంబంధముగా చనిపోయి, పాపపు జీవితంగా మనమెంత మాత్రము జీవించము (రోమా 6:1–6)
5. రెండవ మరణము అగ్నిగుండము (ప్రకటన 2:11; 20:14)

---

ఫిలిప్పీ. 1:20లో భౌతికమైన జీవితము మరణము ఒకదానికొకటి భిన్నంగా ప్రస్తావించబడ్డాయి. ఆ రెండింటిని మనం ఒకేసారి కలిగియుండలేం. గర్భమందు మనకు భౌతిక జీవం యివ్వబడింది. మరణం ద్వారా మనం ఈ లోకంనుండి వెడలిపోతాం.

మరణము పాప ఫలితమైయుంది (రోమా 5:12). అపవాది నరహంతకుడు (యోహాను 8:44); పాపము చేయునట్లు మనలను శోధించుటకే, మరణము యొక్క బలము అతనికి యివ్వబడింది. "మరణము యొక్క బలము గలవానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకు" క్రీస్తు ప్రభువు అవతరించాడు (హెబ్రీ. 2:14; 1 థెస్స. 3:5; 2 తిమోతి 2:26లను కూడా చూడు). పాపము ద్వారా మరణమనేది అపవాది కార్యమైయుండగా నీతిద్వారా జీవమిచ్చుట క్రీస్తు ప్రభువు కార్యమైయుంది (రోమా 5:17).

# మరణమందు ప్రాణాత్మలు

శరీరము మరణించినప్పుడు, ప్రాణాత్మలు సహా చనిపోతాయా? మరణానంతరం మనం జీవించుదుమా? ప్రభువైన యేసు యిలా అన్నారు: “మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమునుకూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి” (మత్తయి 10:28). ఒక ఆత్మను చంపనేరక దేహమునే చంపగలిగినట్టయితే, శరీరం మరణించిన తరువాత కూడ ఆత్మ సజీవంగా ఉంటుంది. శరీరానికి మరణం వచ్చినంత మాత్రాన ఆత్మకు మరణం వచ్చిందని కాదు.

రాహేలు దేహం మరణించినప్పుడు, ఆమె ప్రాణం దానితో చావలేదు గాని, ఆమె చని పోయినప్పుడు ఆమె ప్రాణం వెడలిపోయింది: “ఆమె మృతి బొందెను; ప్రాణము పోవుచుండగా, ఆమె అతని పేరు బెనోని అనెను అతని తండ్రి అతనికి బెన్యామీను అను పేరు పెట్టెను” (ఆది. 35:18). ఒకడు చనిపోయినప్పుడు ఆత్మ దేహాన్ని విడుస్తుంది.

విధవరాలి కుమారుడు బ్రదికింపబడినప్పుడు, వాని ప్రాణం తిరిగి వానిలోనికి వచ్చింది. తన జీవితాన్ని పునరుద్ధరించడానికి గాను, ఏలీయా – “ఆ చిన్నవాని మీద ముమ్మారు తాను పారచాచుకొని – యెహోవా నా దేవా, నా మొఱ్ఱ ఆలకించి యీ చిన్నవాని ప్రాణము మరల రానిమ్మని యెహోవాకు ప్రార్థింపగా యెహోవా ఏలీయా చేసిన ప్రార్థన ఆలకించి ఆ చిన్నవానికి ప్రాణము మరల రానిచ్చినప్పుడు వాడు బ్రదికెను” (1 రాజులు 17:21, 22; KJV). ఆ చిన్నవాని ప్రాణము, మరణమందు వెడలిపోయి ఉండాలి, లేకుంటే అతని లోనికి మరల వచ్చియుండేది కాదు, మరణమందు ప్రాణము దేహాన్ని విడిచి వెళ్లుతుంది.

1 రాజులు 19:4లో ఏలీయా మరణాపేక్షగలవాడైయున్నట్టు చెప్పబడింది. మరణమందు “ప్రాణం” దేహాన్ని విడుస్తుందని మరలా మనకు కన్పిస్తుంది.

కీర్తన. 16:8–11లో దావీదు ప్రవచనముయొక్క నెరవేర్పునందు, ప్రభువైన యేసు శరీరము కుళ్లుపట్టలేదని, ఆయన ఆత్మ పాతాళములో విడిచిపెట్టబడలేదని చెప్పబడింది. పెంతెకొస్తు దినాన, తన ప్రసంగమునందు పేతురు కీర్తన. 16ను ఉపయోగించి, ప్రభువైన యేసు పురుత్థానాన్ని రుజువు చేశాడు (అపొ. 2:29–31). మరణ సమయంలో ఆయన ఆత్మ అతని దేహాన్ని విడిచివెళ్లింది, ఆయన పునరుత్థానుడైనప్పుడు, అది తిరిగి ఆయన దేహంలోనికి ప్రవేశించింది.

“ఈ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నట్టు” ధనవంతుడైన “అవివేకి” తెలుపబడ్డాడు (లూకా 12:20). అంటే అతని ప్రాణము తీయబడుతుంది, దానితో అతనికి మరణం వస్తుంది.

ఈ లేఖనాలను బట్టి అతని దేహాన్ని విడిచి వెళ్లినప్పుడు, శరీరం మృతమౌతుంది. శరీరాన్ని విడిచిపోయినప్పుడు, ఆత్మ మరణించదు. అలాగే ప్రాణంకూడా దేహాన్ని విడిచి వేరుగా ఉంటుంది.

క్రీస్తు మృతిపొందినప్పుడు, దేవుని కాపుదలకు దానిని అప్పగించుకొంటూ, “తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించు కొనుచున్నాననెను” (లూకా 23:46). క్రీస్తు దేహము

కొంతసేపు నిలిచియుండగా, తరువాత అది సమాధిచేయబడింది, కాని ఆయన ఆత్మను దేవుని భద్రతకు అప్పగించుకున్నారు.

మనం జీవితులమైనప్పుడు, మన శరీరమునకున్న సామర్థ్యం కొలది మనం తిరగడానికి స్వాతంత్ర్యంగలవారమై ఉన్నాం. మన ప్రాణాత్మలు దేహాన్ని విడిచి పెట్టినప్పుడు, వాటికి భౌతికమైన చలనము ఇంక ఉండదు. అవి దేవుని కాపుదలమీదనే ఆధారపడి ఉంటాయి. పునరుత్థానమయ్యేవరకు అదృశ్య లోకంలో భద్రం చేస్తాడు.

## ముగింపు

"మరణము" "జీవము" అనే పదాలను వాటి సందర్భంలో గ్రహించవలసి యుంటుంది. మరణ ద్వారం గుండా మనం వెళ్లినప్పుడు మన ప్రాణాత్మలు దేహాన్ని విడిచి వెళ్లి దేహం లేని స్థితిలోనికి ప్రవేశిస్తాయి.